


## రెండు ఉత్తరాలు

# అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



నా జీవితంలో గొప్ప అదృష్టం - ఆలిండియా రేడియోలో ఉద్యోగం. నేనుఉద్యోగంలో చేరారని తెలియగానే చెలం గారు ఉత్తరం రాశారు. 'మీరు రేడియోలో చేరారని తెలిసి చాలా విచారించాను. "A delicate wasted in dirt" అని. మిత్రులు నవభారత్ ప్రకాశరావుగారూ నా మీద ఆశ వదులుకున్నారు. గవర్నమెంట్ ఉద్యోగం నాలోని రచయితని లొంగదీసి, కృంగదీస్తుందని -

కాని ఆ ఉద్యోగం ద్వారా మహామహులతో సాహచర్యం - అనునిత్యం మౌలికమయిన కృషి చేయాలనే స్ఫూర్తి, అందుకు వారి ప్రోత్సాహం - యివన్నీ నా సాహితీ జీవనాన్ని తీర్చిదిద్దాయి. నిజానికి ఈ 20 సంవత్సరాలలో రెండు భువనవిజయాలు ఓ యువ రచయిత జీవితాన్ని పరిపుష్టం చేశాయి.

మొదటి భువన విజయం హైదరాబాదు రేడియో స్టేషన్, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, మునిమాణిక్యం నరసింహారావు, బుచ్చిబాబు, శ్రీవాత్సవ, బాలాంత్రపు రజనీకాంతరావు, దాశరధి, వింజమూరి వరదరాజ అయ్యంగార్, మంచాల జగన్నాధరావు, స్థానం నరసింహారావు, రావూరి భరద్వాజ, ఉషశ్రీ శంకరమంచి సత్యం, తురగా కృష్ణమోహనరావు, పాకాల సావిత్రీదేవి, వేలూరి సహజానంద, పాలగుమ్మి విశ్వనాధం - ఇదీ వాతావరణం. రచనా వ్యాసంగాన్ని నమ్ముకున్న 20 యేళ్ళ యువకుడికి యింతకన్న సుక్షేత్రం మరొకటి దొరకదనుకుంటాను. అయిదేళ్ళు ఈ వ్యక్తులతో జీవనం ఓ తన్మయత్వం.

రెండవ భువనవిజయం - విజయవాడ రేడియో స్టేషన్. జలసూత్రం రుక్మిణీనాధ శాస్త్రి, ఆమంచర్ల గోపాలరావు, డాక్టర్ జి.వి కృష్ణారావు, వింజమూరి శివరామారావు, ప్రయాగ నరసింహశాస్త్రి, బందా కనకలింగేశ్వరరావు, ఎన్.సి.హెచ్. కృష్ణమాచార్యులు, కందుకూరి రామభద్రరావు, శ్రీరంగం గోపాలరత్నం, వోలేటి వెంకటేశ్వర్లు, నండూరి సుబ్బారావు, సి. రామమోహనరావు, ఎన్.సి.సి.హెచ్. జగన్నాధాచార్యులు - యిదీ వాతావరణం. ఇక్కడికి మళ్ళీ మిత్రులు ఉషశ్రీ, శంకరమంచి వచ్చి చేరారు. అప్పటికే లత పదవీ విరమణ చేశారు. వారితో సాహచర్యం మరో గొప్ప అవకాశం.

ఈ అతిరధులలో - నన్నుఅభిమానించి, అల్లంత దూరం నుంచే నా అభివృద్ధిని గమనిస్తూ, నన్ను ఆశీర్వదించిన పెద్దలు కందుకూరి రామభద్రరావుగారు. ఆయన నిండుకుండ, గంభీరమైన చిరుదరహాసం, ముక్తసరయిన పలకరింత, ఏనాడూ అనవసరమైన, వృధా ప్రసంగాలకి తావివ్వని సరళత్వం - అదీ రామభద్రరావుగారు. ఏనాడూ 'ఫోకస్' కోసం తాపత్రయపడడమో, ప్రోగ్రాం మీటింగులలో విరుచుకుపడడమో చేసేవారు. అది గంభీరమైన కితాబు నాలాటివాళ్ళకి. ముఖ్యంగా నాకు ప్రత్యేకమయిన స్ఫూర్తినిచ్చేది. ఆయన దేశభక్తి, సమాజ

అభ్యుదయకాంక్ష - ఇవన్నీ సరేసరి. లలిత సంగీత కార్యక్రమాలలో అవి గుబాళించేవి.

రామభద్రరావుగారి కుటుంబానికి, మా ఆవిడ చాలా సన్నిహితం. మా పిల్లలకోసం మాంటిస్సోరి స్కూలుకి వెళ్ళి, బడి వదిలే వరకూ వారింట్లో కూర్చునేది. వారి శ్రీమతికి మా ఆవిడంటే అభిమానం. ఇక ఆ కుటుంబంతో నాకు మూడు తరాల సాన్నిహిత్యం, కందుకూరి వారితో రేడియో ఉద్యోగం, శశాంకగారితో సాహితీ పరిచయం, దరిమిలాను వారబ్బాయి వోలేటి పార్వతీశంతో కలిసి కడప రేడియో ఉద్యోగం, అభిరుచి, సంస్కారం, విద్యుత్తు కలబోసిన కుటుంబాలవి.

రామభద్రరావుగారి పనుపునే అమలాపురం కాలేజీ వార్షికోత్సవాలకి వారబ్బాయి పుండరీకాక్షుడుగారు తీసుకెళ్ళగా వెళ్ళాను. ఏటేటా కందుకూరి వారి స్మృతి చిహ్నంగా ఆత్రేయపురం కళాశాల జరిపే ఉత్సవానికి నేనూ, శలాక రఘునాధ శర్మగారూ వెళ్ళాం. ఆ సందర్భంలో వారి స్వస్థలం రాజవరం వెళ్ళడం - అదొక మధురమైన జ్ఞాపకం.

కందుకూరి రామభద్రరావుగారితో నా సాన్నిహిత్యానికీ, వారికి నా పట్ల గల అవ్యాజానురాగాలకీ రెండు గొప్ప నిదర్శనాలు - వారు నాకు రాసిన రెండే రెండు ఉత్తరాలు. రెండు సందర్భాలూ నేను ఊహించినవి కావు - ముఖ్యంగా కందుకూరి వారి వంటి విద్యావేత్త నుంచి.

1969 సెప్టెంబరు 30న ప్రయాగ, కందుకూరి, గుమ్మలూరి సత్యనారాయణగారు - పదవీ విరమణ చేశారు రేడియో స్టేషన్ నుంచి. ఆ తర్వాత రామభద్రరావుగారు అమలాపురంలో వారబ్బాయిగారి దగ్గర ఉన్నారనుకుంటాను.

1970 సెప్టెంబరులో విజయవాడ రైల్వే ఇన్స్టిట్యూట్లో ఆంధ్రనాటక కళాపరిషత్ నాటకోత్సవాలు జరిగాయి. అది నాటకరచయితగా నా జీవితంలో మకుటాయమానంగా చెప్పుకోదగిన సందర్భం. పరిషత్ చరిత్రలో మొట్టమొదటిసారిగా అటు నాటకాలకీ ఇటు నాటికలకీ నా రచనలు - కరుణించని దేవతలు, కళ్ళు - ఉత్తమ రచన బహుమంతులందుకున్నాయి. రెండు వేర్వేరు న్యాయనిర్ణేతల బృందాలు ఈ బహుమతులను నిర్ణయించాయి. అందులో దాడి గోవిందరాజులు నాయుడుగారు. కె.రామలక్ష్మి, ప్రభాకరగుప్తా వంటివారున్నారు. కాగా, ఉత్తమ ప్రదర్శన - కళ్ళు, ఉత్తమ నటుడు - ఎమ్. వాసుదేవ మూర్తి (రెండు రెళ్ళు ఆరు), ఉత్తమ నటి - గూడూరు సావిత్రి (కరుణించని దేవతలు), ఉత్తమ నటుడు - ఎమ్.వి.రామారావు (కరుణించని దేవతలు). అదొక అపూర్వమైన ఘట్టం - నా జీవితంలో. సెప్టెంబరు 9న బహుమతి ప్రదానోత్సవం జరిగింది.

సెప్టెంబరు 16న కందుకూరి రామభద్రరావుగారు ఉత్తరం రాశారు. ఆ ఉత్తరాన్ని ఇంగ్లీషులోనే ఇక్కడ ఉటంకిస్తున్నాను:

"Believe me, I felt so glad that, mentally I was transferred to Vijayawada for a couple of minutes. I know this is not the be-all and end-all of your achievements. As time advances and life deepens, your special talent for writing intellectual plays carries you into higher and much greater recognition. The late Amancharla Goplalarao used to discuss your plays with enthusiasm and admiration. "

ఎంత గొప్ప ఆశీర్వాదం! వాక్శుద్ధిగల ఓ సాహితీస్రష్ట నోట పలికిన భవిష్యత్ వాణి అది!

జీవితం మరో ఆరు సంవత్సరాలు సాగింది. సినీ రంగంలో మరిన్ని సోపానాలు ఎక్కే అవకాశం లభించింది. విశ్రామమెరుగని పరుగు. ఒకే దూకుడు. ఒకే లక్ష్యం వేపు దృష్టి సారింపు. సాహితీ జీవితం గంభీరమైన రచనా వ్యాసంగం నుంచీ మామూలు సామాజికుడిని అలరించే మీడియం వైపు మొగ్గ చూపింది. అది కోరి చేసిన ప్రయాణం కాదు. సినీమా తనకు తానే నావేపు దూసుకు వచ్చిన ప్రభంజనం.

ఆ సమయంలో అనుకోకుండా రామభద్రరావుగారి నుంచీ రెండో ఉత్తరం వచ్చింది. అది కాస్త నాకాశ్చర్యమూ, ప్రత్యేకమైన ఆనందమూ కలిగించిన విషయం. కారణం - ఓ నాటక రచయితని అభినందించడం మొదటి ఉత్తరం ఉద్దేశమైతే - ఈ మీడియంతో ఏ మాత్రమూ సంబంధం లేని రామభద్రరావుగారి

లాంటి సాహితీపరులు నా సినిమా వ్యాసాంగాన్ని అభినందిస్తూ ఉత్తరం వ్రాయడం.

తేదీ 28.8.76 విషయం" ఈ మధ్య మీరు మాటలు వ్రాసిన కొన్ని సినిమాలు చూశాను. అవి చాలా రక్తిగా ఉన్నాయి. ఆ సంభాషణలు నడపడంలో, ఊహ పోహలలో, ఉక్తివైచిత్రిలో ప్రతిభావంతమైన మీ ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుంది. మానవ స్వభావాన్ని మెరిపిస్తూ, రక్తిని ఉన్నతస్థాయిలో చిత్రమంతా నిలబెడుతుంది. ఇందుమూలంగా మీరు సంఘానికి ఎనలేని సేవచేస్తున్నారని, ముందితోధికంగా చేస్తూ చాలా ప్రతిష్టనార్జిస్తారని విశ్వసిస్తున్నాను'.

ఇది నా సినీ రచన మీద నాకందిన అతి గొప్ప ప్రశంసగా భావిస్తాను. ఇప్పటి సినీ రచయితలూ, దర్శకులూ - అంతా - ఈ వాక్యాలు గుర్తుంచుకోవాలంటాను. 'ఆ సంభాషణలు - రక్తిని ఉన్నత స్థాయిలో చిత్రమంతా నిలబెడుతుంది.' అన్నది.

రక్తికోసం నానా దేబిరింపులూ, కేవలం నేలబారు స్థాయిలో సాహిత్యాన్నీ, నటననీ (ఈ రెండూ ఈనాటి సినిమాల్లో అవసరమని చాలా మంది భావిస్తున్నారని అనుకోను) దిగజార్చే తరుణంలో - నిన్నటి తరం పెద్దమనిషి వ్రాసిన ఈ సమీక్ష అందరికీ కనువిప్పుగా, నాకు అపురూపమయిన కితాబుగా భావిస్తాను.

సరిగ్గా నలభై రోజుల తరువాత రామభద్రరావుగారు కన్నుమూశారు. ఈ ఉత్తరం నా హితైషి ఆఖరి ఆశీర్వాదంగా భావిస్తాను నేను.

## సరదా..సరదాగా

*పార్వతమ్మ గారు హడావిడిగా లలితమ్మ గారి దగ్గరకొచ్చారు.*

*"ఏమండీ! విశాలాక్షిగారికి నేను ఎవరితోనూ చెప్పొద్దన్న రహస్యం మీరు చెప్పేశారని ఆవిడ నాతో చెప్పింది. నిజమేనా?"*

*"నిజమేననుకోండి! కానీ నేనావిడకు రహస్యం చెప్పేసిన విషయం మళ్ళీ మీతో చెప్పొద్దని ఆవిడతో అప్పుడే చెప్పానుగా!" చిరాకుగా అంది లలితమ్మ గారు.*

*"సరే పోనీలెండి! అయిందేదో అయింది. మీరావిడకు చెప్పిన రహస్యం ఆవిడ మళ్ళీ నాతో చెప్పిన విషయం గురించి నేను మీతో చెప్పినట్లు మళ్ళీ ఆవిడతో చెప్పకండి..!"*

**యర్రంశెట్టి శాయి**